**అడ్డదారిలోనైనా అందలమెక్కాలని ఆరాటపడే వాళ్ళకి ఆశాభంగం తప్పదు.**

# షాక్

డైనింగ్ టేబుల్ ముందు కుర్చీలో కూర్చుంటున్న గిరి అప్పుడే ఫోనులో మాట్లాడి వస్తున్న తల్లిని చూసి "ఫోను ఎవరి దగ్గర్నుండేమిటి...? మొహంలో అంత ఆనందం కనిపిస్తోంది..." అన్నాడు.

"నిజమే... నాకు చాలా ఆనందంగా ఉంది. నీకు గుర్తుందా...? మా పెదనాన్న గారబ్బాయి రామనాథం అన్నయ్య అని చెబుతూంటానే... బిజినెస్ చేస్తూ సింగపూర్‌లో సెటిల్ అయిపోయాడు కదా! పదిరోజుల క్రితం ఇండియా వచ్చి బంధువులందర్నీ వాళ్ళ వాళ్ళ ఊళ్ళకెళ్ళి పలకరించి వస్తూ నిన్ననే ఇక్కడికి వచ్చాడట. హోటల్లో ఉన్నాడు. ఈవేళ మనల్ని కలుస్తానన్నాడు..." విప్పారిన వదనంతో ఉత్సాహంగా చెప్పింది వేదవతి.

గిరి నిర్లిప్తంగా "అలాగా..." అన్నాడు.

వేదవతి సంబరంగా మళ్ళీ మొదలు పెట్టింది. "ఈ ఊళ్ళోనే... నేను సిక్స్, సెవెన్త్ క్లాసులు చదివేటప్పటి రోజుల్లో పెదనాన్నా వాళ్ళు, మేము సంతోషినగర్ కాలనీలో పక్కపక్క ఇళ్ళల్లోనే ఉండేవాళ్ళం. అప్పట్లో నాకు లెక్కల సబ్జెక్టు కొరుకుడు పడేది కాదు. అన్నయ్య అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా చెప్పటం మొదలు పెట్టాకనే నాకు లెక్కల్లో ఫస్టు మార్కులు వచ్చాయి. నేను మాథ్స్ లెక్చరర్ కావటానికి అన్నయ్యే పునాది వేశాడనిపిస్తుంది. సాయంకాలాలు ప్రతి రోజూ తప్పనిసరిగా మా కాలనీకి దగ్గర్లో ఉండే పార్కుకి నన్ను వెంటబెట్టుకెళ్ళేవాడు. అక్కడున్నంతసేపూ కథలూ, కబుర్లూ కొల్లలే... ఒకసారి ఏమైందో తెలుసా...!" అంటూ నవ్వు మొహంతో గిరి ప్లేటులో మరో ఇడ్లీని వేసి తనూ పెట్టుకుంటూ చెప్పుకుంటూ పోతోంది.

"సాయంకాలం పార్కులో కూర్చున్నప్పుడు... అన్నయ్య సుబ్బు అనే కుర్రాడి దగ్గర రోజూ ఓ వేరుశెనగ పప్పుల పొట్లం కొనేవాడు. ఆ సుబ్బు కూడా అందర్నీ చనువుగా పలకరిస్తూ హుషారుగా

అమ్మేవాడు. అప్పుడు వాడికి పది పన్నెండేళ్ళకంటే ఎక్కువ వయసుండదు. ఓరోజు... బాగా వర్షం పడి వెలిసాక మేం పార్కుకి వెళ్తే... చిత్తడిగా ఉంటుందని కాబోలు, జనం లేరు. సుబ్బు ఓ చోట దిగాలుగా కూర్చున్నాడు. అన్నయ్యే పలకరించి 'అలా ఉన్నావేం?' అనడిగాడు. 'ఈ వేళ చల్లగా ఉంది. బాగా అమ్మకం జరుగుతుందని రోజూకంటే ఎక్కువ పప్పు వేడిగా తెచ్చాను. చూస్తే... ఇక్కడ జనం లేరు. ఈరోజు వచ్చే డబ్బుతో చెల్లాయి స్కూలు ఫీజుకి సరిగ్గా సరిపోతుందని నేను లెక్కలు వేసుకున్నాను సార్...' అని సుబ్బు దిగులుగా చెప్పాడు. సుబ్బు రోజూ వేరుశెనగపప్పు అమ్మకం లాభంలోంచి కొంత తల్లికిచ్చేసి మిగతాది వేరే దాస్తుంటాడట. వాడి చెల్లెలు చదువు ఖర్చంతా సుబ్బాయే చూసుకుంటాడట. అన్నయ్య సుబ్బుని ఆ బుట్ట అంతా అమ్మకం జరిగితే ఎంత వస్తుందో వివరం అడిగి ఆ మొత్తం తన జేబులోంచి తీసి ఇచ్చేసి ఆ వేరుశెనగ పప్పుల్ని ఓ పెద్ద కవరులో పోయించుకుని ఇంటికి పట్టుకొచ్చేశాడు. సుబ్బు మొహమాటంగా వద్దన్నా వినలేదు. అప్పుడు అన్నయ్య ఇంటర్ సెకండియర్‌లో ఉన్నాడు. కాలేజీ ఫీజుకని పెదనాన్న ఇచ్చిన డబ్బు, ఆ రోజు కట్టడానికి కుదరకపోవటంతో జేబులోనే ఉందన్నమాట. ఇంటికొచ్చాక పెద్దమ్మ 'ఇలా చేశావేంటిరా? సాయం చేసే ముందు వెనకా ముందూ ఆలోచించుకోవద్దూ... మనదీ బొటాబొటీగా జరుగుతున్న సంసారమే. మీ నాన్నని మళ్ళీ అడిగితే మండిపడరూ...?' అని చీవాట్లు పెట్టింది పెద్దమ్మ.

'నువ్వేం నాన్నని అడగొద్దులే...' అనేసి అన్నయ్య ఏం చేశాడో తెలుసా? ఓం డబ్బాలో పోసిన ఆ పప్పుల్ని మర్నాడు ఓ బుట్టలో పెట్టుకుని ఆ పార్కులోనే సుబ్బుతో పాటు తిరిగి అన్నీ అమ్మేశాడు! ఆ పార్కులో మా కాలనీలోని వాళ్ళే ఎక్కువుంటారు. వాళ్ళందరూ అన్నయ్యని విచిత్రంగా చూసినా పప్పుల పొట్లాల్ని నాలుగైదు కొన్నారు. మొత్తానికి సుబ్బుదీ, అన్నయ్యదీ... ఇద్దరి బుట్టలూ ఖాళీ అయ్యాయి. ఆ డబ్బుని పెద్దమ్మకి చూపిస్తే – పెద్దమ్మ సరదాగా నవ్వి 'ఇంటి ఖర్చుల్లో సర్దుకుని నేను ఇస్తాగానీ, ఈ డబ్బు సుబ్బుకే ఇచ్చి వాడి చెల్లెలు స్కూలు అవసరాలకి వాడుకోమని చెప్పు...' అనేసింది.

ఇలాంటి పనులు అన్నయ్య చాలానే చేసేవాడు. అందుకే అన్నయ్యంటే నాకు ఇష్టం, గొప్ప గౌరవం వుండేవి" అంటూ బాల్యస్మృతుల్ని నెమరేసుకుంటున్నప్పుడు కలిగే ఆనందంతో హాయిగా నవ్వింది.

నిరాసక్తంగా వింటున్న గిరి "సరే... సరేమ్మా. నాకు ఆఫీసుకు టైమవుతోంది. ఈవేళ ప్రమోషన్ వచ్చేవాళ్ళ లిస్టు వస్తుందంటున్నారు. ఈసారైనా ఆ లిస్టులో నా పేరు ఉంటుందో, లేదో..." అంటూ నిట్టూర్చి – "నీ ప్లేటులో ఇడ్లీలు అలాగే ఉన్నాయి. ఒక్కటే తిన్నావు. మీ అన్నయ్య కబుర్ల ఆనందంతోనే నీకు పొట్ట నిండిపోయిందనుకుంటాను..." అన్నాడు.

"నిజమే..." అంటూ వేదవతి నవ్వి– "మన బంధువులెవరో అన్నయ్యకి నేను ఈ ఊళ్ళోనే ఉంటున్నానని చెప్పి, నా ఫోను నెంబరు ఇచ్చారట. మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత చిన్నపుడున్న ఊళ్ళోనే నన్ను కలుసుకుంటున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నాడు. సంతోష్ నగర్ పార్కు అలాగే ఉందా అని వాకబు చేశాడు. ఉందన్నాను. మనింటికి రమ్మంటే తర్వాత వస్తానని, ముందు ఈవేళ సాయంకాలం కాసేపు ఆ పార్కులో కూర్చుందాం, రమ్మన్నాడు. సాయంకాలం తనుంటున్న హోటల్ నుండి టాక్సీ పంపిస్తాడట..."

సరేనన్నట్లుగా తలవూపి బయలుదేరుతున్న కొడుకుని గుమ్మం దగ్గర ఆపి – “చెప్పటం మర్చిపోయాను. నాలుగేళ్ళ క్రితం మా వదిన చనిపోయినప్పటి నుండీ అన్నయ్య ఆరోగ్యం దెబ్బతింది. ఇక్కడికి వచ్చిన ఈ పది రోజుల్లో ఇంకొంచెం తేడా వచ్చినట్లుగా అనుమానం రావటంతో రేపు ఇక్కడ కృష్ణా నర్సింగ్‌హోమ్‌లో చెకప్ చేయించుకోవాలనుకుంటున్నాడు. ఆ ఆసుపత్రిలో నీకు బాగా తెలిసిన డాక్టరెవరో ఉన్నారుగా… ఆఫీసులో పర్మిషన్ తీసుకుని అన్నయ్యకు తోడుగా వెళ్తావా…?” అంది.

“ఏంటమ్మా… నేను ఆఫీసుకు సెలవు పెట్టి ఆ ముసలాయన్ని వెంటబెట్టుకుని హాస్పిటల్ చుట్టూ తిరగాలా…? నయమే, ముందుగా నన్నడిగావు. ఆయన గొడవేదో ఆయనే చూసుకుంటార్లే. నాకిలాంటివి పెట్టకు…” చిరాగ్గా అన్నాడు.

“అది కాదురా… పెద్దవాడు కదా కొంచెం సహాయంగా నువ్వుంటే…” తల్లి మాటలకు మధ్యలోనే అడ్డం వచ్చి “మీ అన్నయ్యలాగే నీకూ సహాయాలూ, సేవా కార్యక్రమాలూ వంటి చాదస్తాలున్నాయి గానీ నాకు మాత్రం లేవు! నన్నొదిలెయ్…” అంటూ వెళ్ళిపోయాడు.

వేదవతి నిట్టూర్చింది.

* * *

“గిరీ! నేనిక్కడ సంతోషినగర్ పార్కులో ఉన్నాను. అన్నయ్య పంపించిన టాక్సీలో వచ్చాను. ఇప్పుడే అన్నయ్యకు ఎవరి దగ్గర్నుండో ఫోను వస్తే వాళ్ళని వెంటనే కలవాల్సి వచ్చిందట. నువ్వొచ్చి నన్ను తీసుకెళ్తావని తనని వెంటనే వెళ్ళమన్నాను. నీకెలాగూ ఆఫీసు అయిపోయే టైమయిందిగా… నువ్విటు వస్తే, ఇద్దరం నీ బండిమీద ఇంటికెళ్దాం. చివరి గేటుకు దగ్గర్లో తురాయి చెట్టు పక్కన కూర్చున్నాను” అంటూ వేదవతి ఫోను చేసి గిరికి చెప్పింది.

అతను ఫోనులోనే రుసరుసలాడాడు. “టాక్సీ పంపించి రప్పించుకున్న మీ అన్నయ్యకు తిరిగి అలానే పంపించాలనే మర్యాద తెలియదా…? నిన్ను ఒంటరిగా వదిలి తను వెళ్ళిపోయాడా..? ఆఫీసు ఇక్కడికి కొంచెం దగ్గరే అయినా, మళ్ళీ అక్కడి నుండి మనింటికి వెళ్ళాలంటే ఎంతో దూరం. మీ అన్నయ్య ఎంతో గొప్ప మనిషన్నట్లుగా నువ్వు మాట్లాడావ్…!”

“అది కాదురా… అన్నయ్య నన్ను మనింటి దగ్గర డ్రాప్ చేసి వెళ్తానంటే తనకి అర్జంటు పని కదా అని నేనే వద్దన్నాను. నీ ఆఫీసు ఇక్కడికి దగ్గరే అని నేను వెళ్ళమని చెప్తేనే వెళ్ళాడు. మరి పని ముఖ్యం కదా! నాకు పనేముందిలే… అని, చల్లగాలికి తీరుబడిగా కూర్చున్నాను…” అంది.

“సరేలే… తప్పేదేముంది. రెండు నిముషాల్లో బయలుదేరతాను…” అంటూ గిరి ఫోను పెట్టేశాడు.

పార్కులో ఓ మూలనున్న పెద్ద చెట్టుకు ఆనుకుని ఉన్న సిమెంటు బెంచీపై కూర్చున్న తల్లిని చూసి గిరి అక్కడకు వచ్చి “బయల్దేరదామా…” అనడిగాడు.

“అలాగే! ఓ రెండు నిముషాలు కూర్చో…” అంటూ చేతిలోని వేరుశెనగపప్పు పొట్లం కొడుకు చేతిలో పెట్టింది వేదవతి.

"ఏమిటి...? ఇది మీ అన్నయ్య కొనిపెట్టాడా...?" అంటూ పెద్దగా నవ్వుతూ తల్లి పక్కనే కూర్చుని ఓ పలుకు నోట్లో వేసుకున్నాడు.

వేదవతి తలూపుతూ "అవును... అన్నయ్యే కొన్నాడు. చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్నాం కదా! చిన్నప్పటిలా ఇప్పుడు మళ్ళీ వేరుశెనగ పప్పులు తింటూ కబుర్లు చెప్పుకుంటుంటే చాలా సంతోషంగా అనిపించింది. కొన్ని చిన్న చిన్న సరదాలే గొప్ప ఆనందాన్నిస్తాయి" తన్మయత్వంతో అంది.

"ఆరోగ్యం అంత బాగాలేదన్నావ్... ఎలా ఉన్నాడు మీ అన్నయ్య...?" యథాలాపంగా అడిగాడు.

వేదవతి నిట్టూర్చింది. "వయసుకు మించిన వృద్ధాప్యం మీదపడినట్లుగా ఉన్నాడు. తన పిల్లలకి సింగపూర్‌లోని ఆస్తిపాస్తులన్నీ పంపకం చేసేసి, తన వాటాకి తీసుకున్న డబ్బుతో ఈ ఊళ్ళో ఏదైనా చేద్దామనే ఉద్దేశ్యంతో వచ్చాడట. మా బంధువుల్లో నమ్మకస్తుడూ సమర్థుడూ అయిన వాళ్ళకి తన ఆస్తిపై పవర్ పట్టా ఇచ్చేసి, పిల్లల దగ్గరకు సింగపూర్ వెళ్ళిపోయి, ఆరోగ్యం కుదుటబడితే నాలుగైదేళ్ళ తర్వాత వచ్చి ఇక్కడే స్థిరపడదామని అనుకుంటున్నాడు. ఎవరిమీదా నమ్మకం కుదరక నన్ను అడిగాడు. మీ నాన్న మనల్ని వదిలి పైకెళ్ళిపోయినప్పటి నుండీ... ఏదో బండి లాగిస్తున్నానుగానీ నాలో శక్తి, ఉత్సాహం అన్నీ సన్నగిలి పోయాయి. అందుకే సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి ఉన్నా గానీ నా వయసు, ఆరోగ్యం సహకరించవని, కుదరదని చెప్పేశాను".

ఎటో చూస్తూ వేరుశెనగ పప్పులు నములుతున్న గిరి "మీ అన్నయ్య ఆస్తి ఎంత ఉంటుందేం?" అనడిగాడు.

"అప్పుడెప్పుడో... ఎవరి ద్వారానో ఈ ఊళ్ళోనే చవకలో పెద్ద స్థలం కొన్నాడటలే.. అక్కడ ఓ హాస్పిటల్, పిల్లలకి స్కూలు కట్టించాలని అన్నయ్య ఆశయం. ఆస్తి సుమారుగా అరవై కోట్ల పైనే ఉంటుందన్నారు మరి...".

"ఏమిటీ...? అరవైకోట్లా...? గిరి నోరెళ్ళబెట్టాడు.

"ఎందుకంత ఆశ్చర్యం? అన్నయ్య సింగపూర్‌లో ఎన్నేళ్ళనుండో బిజినెస్ చేస్తూ బాగానే సంపాదించాడు" అంది.

"మరి... నువ్వు అంత తెలివి తక్కువగా చేతికంది వచ్చిన అదృష్టాన్ని ఎందుకు విసిరి కొట్టావు?" విస్మయంగా అడిగాడు.

"అన్నయ్య తలపెట్టిన గొప్పపనిలో శ్రమదానం చేయగలిగే అవకాశాన్ని... నిజమే ఆ అదృష్టాన్ని జారవిడుచుకున్నాను. ఏం చేయను? ఈ వయసులో నా వల్ల కాదు. నీకేమో ఇలాంటి పనుల పట్ల ఆసక్తి అసలే లేదుగా..." నిర్లిప్తంగా అంది.

గిరి మనసులోనే విలవిల్లాడిపోతున్నాడు. "అరవై కోట్ల ఆస్తి...! అందులో పదోవంతు అయినా... నేను తలక్రిందులుగా తపస్సు చేసైనా సంపాదించగలనా...?" అన్నాడు.

"అదేంట్రా... ఆస్తి నీదెందుకవుతుందీ? అప్పగించిన పనికి ఖర్చు పెట్టాలిగానీ?" ఆశ్చర్యంగా చూస్తూ కొడుకుని అడిగింది.

"ఏమిటమ్మా మతి లేకుండా మాట్లాడుతున్నావ్... ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉండే పెద్దాయన ఎన్నాళ్ళుంటాడేం? ఎక్కడో సింగపూర్‌లో ఉంటాడు. ఆయన అజమాయిషీ కూడా ఉండదు! పెత్తనమంతా మనదే అవుతుంది".

"ఛ... ఛ... ఏం మాటల్రా... ఇలాంటి వాటిని నేనొప్పుకుంటాననుకున్నావా?" కరుగ్గా అంది.

"ఏంటమ్మా నీ చాదస్తం? సంపాదించుకోగలిగే ఏ చిన్నఅవకాశాన్నయినా సరే, ఈ రోజుల్లో వదలుకోవడం లేదు. అది అక్రమమా, సక్రమమా అనేది పట్టించుకోవడం లేదు. సేవా సంస్థలకి వచ్చే విరాళాల్ని చాలామంది పదోవంతు ఖర్చు చేస్తారేమో...! మిగతాదంతా వాళ్ళ సొంత ఖాతాలోకే జమయిపోతుంది. అయినా ఒక్కమాట నన్నడగకుండా నువ్వే ఆయనకు మా వల్ల కాదని తెలివితక్కువగా ఎందుకు చెప్పేశావ్...?" చివరి వాక్యం అన్నప్పుడు గిరిలో ఆవేశం పెరిగిపోయి చేతిలోని పొట్లాన్ని విసురుగా నేలకేసి కొట్టాడు.

"మొన్నీమధ్యనే నేనెక్కడే చదివాను. దానాలు పదమూడు రకాలట. వీటిలో సమయదానం అనేది కూడా ఉంది. మా అన్నయ్యలాంటివాడు నాకెంత ఇష్టమో నీకు చెప్పాను. అయినా ఆయనకు సహాయంగా వెళ్ళటానికి కొంచెం సమయాన్ని కూడా వెచ్చించలేని నువ్వు అంతపెద్ద బాధ్యతను తీసుకుంటావని ఎలా అనుకుంటాను...?"

"అబ్బ... ఎంత చెప్పినా నా పాయింటు నీ తలకెక్కదేంటమ్మా?" కోపంతో స్వరం పెంచి తల పట్టుకున్నాడు.

వేదవతికి కళ్ళమ్మట నీళ్లు వచ్చాయి. "ఎందుకురా అంత ఆవేశం...? మనమేదో పోట్లాడుకుంటున్నామని నలుగురూ అనుకునేట్లుగా అంత గట్టిగా మాట్లాడతావేం...? పక్క బెంచీ మీద కూర్చున్నాయన చూడు, ఎలా చూస్తున్నాడో..." డగ్గుత్తికతో మెల్లగా అంది.

అపుడే లేచి నిలబడిన ఆయన ఒక అడుగు ఇటు వేశాడు.

గిరి చిరాగ్గా లేచి నిలబడి ఆయన వైపు చూసి "ఏమయ్యా...! పేపరు చదువుకుంటున్న వాడివి చదువుకోక... ఇటు చెవులప్పగించడం దేనికీ... దేశంలోని వార్తలు చాల్లేదా...? మా కబుర్లూ కావల్సి వచ్చాయా...?" విసురుగా అన్నాడు. ఆయన పేపరు మడిచి చేతబట్టుకొని మౌనంగా పార్కు గేటు వైపుగా వెళ్ళిపోయాడు.

గిరి తల్లికి దగ్గరగా జరిగి భుజం చుట్టూ చేయి వేసి అనునయంగా "ఇపుడు కన్నీళ్ళు పెట్టుకోవడం దేనికమ్మా...? ఇప్పటికీ మించిపోయిందేం లేదు. మీ అన్నయ్యకు ఫోను చేసి 'నువ్వు తలపెట్టిన పని చేయడటానికి మా అబ్బాయికి అంగీకారమే...' అని ఓ మాట చెబితే సరిపోతుంది. నిజంగా నేను నువ్వు చెప్పినట్లే ఆయన పథకాలను అమలు చేస్తాను. సరేనా...!" అన్నాడు.

వేదవతి కొడుకు వైపు విస్మయంగా చూసి గట్టిగా నిట్టూర్చి – "లేదురా...! ఇక ఆ అవకాశం తప్పిపోయింది. నా ప్రమేయం లేకుండా నేరుగా నీ సమాధానం ఏమిటో మా అన్నయ్యకే వినిపిద్దామని నిన్నిక్కడకు రప్పించాను. నీ అండ లేకుండా సొంతంగా చేయగలిగిన వయసు కాదుగా నాది! విషయం తెలుసుకొని తన అన్వేషణ ఇంకా కొనసాగించాల్సి ఉంటుందని అర్థమై పాపం ఎంత నిరాశగా వెళ్ళాడో...! పక్కబెంచి మీద కూర్చున్నాయనే మా రామనాథం అన్నయ్య".

పక్కనే బాంబు పేలినట్లుగా గిరి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.

"గిరీ...! డబ్బు సంపాదించాలనే నీ కోరికను సమర్థిస్తాను. అయితే విలువలకు తిలోదకాలిచ్చే ఏ దారిలోనైనా సరే...! అనుకునే నీ వాదాన్ని మాత్రం హర్షించను! అది నలుగురు నడిచే దారే అయినా నాకు సమ్మతం కాదు! పరుల సొమ్ముకు ఆశపడటం తప్పనే నీతి సూత్రాన్ని నా తల్లిదండ్రుల దగ్గర్నుంచి అందిపుచ్చుకున్న నేను... ఆ విలువల్ని నా పెంపకంలో నీకందించలేకపోయానే అనే బాధతో మాత్రమే కన్నీళ్ళు పెట్టుకున్నాను. ఆర్థిక ఇబ్బందులు ఎంత చికాకు పెడతాయో నాకు బాగానే తెలుసు! అయితే జీవితాన్ని ఆనందంగా గడపటానికి, ఆస్వాదించడానికి చాలా విషయాలు కారణాలవుతాయి. డబ్బు కూడా ఒక ఉపకరణం అవుతుందే గానీ, అదే మూలాధారం మాత్రం కాదు...! ఇది నువ్వు తెలుసుకోగలిగితే మంచిది!" అంది వేదవతి కన్నీళ్ళు తుడుచుకుంటూ...

ఆ మాటలు అతనికి వినిపించాయో లేదో సందేహమే... ఎందుకంటే అతనంతటి షాక్‌కి గురయ్యాడు మరి.

* * *

**'విపుల వీక్లీ' అక్టోబరు 2014**